## ఈ వారం కథ


బొమ్మలు : అక్బర్

సాయి బ్రహ్మానందం గొర్తి

**ఇంటికొచ్చేసరికి అమ్మ రుసరుసలాడుతూ ఉంది. నన్ను చూసీ చూడగానే తన అసహనాన్ని అక్కడున్న వస్తువుల మీద చూపించింది. అకారణంగా కోపం తెచ్చుకోవడం అమ్మల సహజ లక్షణం అనుకుంటాను. నాకేమీ అర్థం కాలేదు. ఏమీ పట్టనట్లు మేడమీద నా గదివైపుగా వెళ్లాను. బ్యాక్ పాక్ పక్కనబెట్టి తలుపేద్దామని చూస్తే అక్కడ అమ్మ నిలబడుంది. ఏమయిందన్నట్లు కళ్లెగరేసాను.**

# ఐ హేట్ మై లైఫ్

"నువ్వు సీనియర్ నైట్ పార్టీకి సైనప్ చేసావా?" మాటలు మెల్లగా ఉన్నా కళ్లల్లో కోపం లావాలా ఉప్పొంగింది. అవునన్నట్లు తలాడించాను.

"నాతో చెప్పలేదేం?" ఈసారి గొంతు పెరిగింది. ఆశ్చర్యంగా చూసాను. నా నుండి జవాబు రాకపోయేసరికి ఉక్రోషంగా మళ్లీ అదే అడిగింది.

"అమ్మా! ఇది ఆర్నెల్లక్రితం స్కూల్ నోటీసులో ఉంది. డాడ్ చెక్కు రాసిస్తేనే కట్టాను. అయినా ఇప్పుడెందుకిదంతా...?"

"నువు వెళ్లడం లేదు..." అరిచినట్లుగా అంది. ఏం? అన్నట్లు కళ్లు చిట్లించి, ఆశ్చర్యంగా చూసాను.

"ఆ సీనియర్ నైట్ పార్టీలో డాన్సులూ, ముద్దులూ ఉంటాయట కదా? నీరూ వాళ్లమ్మ చెప్పింది!"

"అమ్మా అది ఒక హైస్కూల్ ఇయర్ ఎండ్ పార్టీ! మా స్కూల్ టీచర్లందరూ ఉంటారు!"

""ఈ సీనియర్ నైట్ ప్రామ్ గురించి నెట్‌లో అంతా చదివాను. నువ్వు వెళ్లడం లేదంతే!"

"అమ్మా....! డాడ్..." అని చెప్పబోతుండగానే నా మాటలు వినిపించుకోకుండా "డాడ్ కాదు. నేను చెబుతున్నాను. వచ్చాక ఆయనే చెబుతారు నీకు..." అనేసి విసురుగా వెళ్లిపోయింది.

ఒక క్షణం తలదిమ్మగా అయింది. ఆలోచిస్తే అర్థమయ్యింది. ఇదంతా నీరూ చేసిన పనే! ఐ హేట్ నీరూ!

•••

మూడువారాల నుండి అమ్మ నాతో విచిత్రంగా ప్రవర్తిస్తోంది. అయినదానికీ కానిదానికీ చిర్రుబుర్రులాడుతోంది నా మీద. సరిగ్గా రెండు వారాల క్రితం ఇంట్లో పెద్ద గొడవ జరిగింది. కర్టిసీ నీరూ! ఆ రోజు స్కూలు నుండి రాగానే అమ్మ అగ్గిమీద గుగ్గిలం అయ్యింది. యుద్ధం మొదలు పెట్టింది.

"ఏంటి? ఫేస్‌బుక్కులో వాడెవడినో హగ్ చేస్తూ ఆ ఫోటో! తీసెయ్యి. పరువు తీస్తున్నావు కదే? మన ఇంటా వంటా లేవ ఇలాంటి పనులు..."

నా గదికి వెళ్లినా, వెనకాలే వచ్చి, మళ్లీ అదే గోల. చెప్పిందే చెప్పడం! ఇంతకీ నేను చేసిన నేరం ఏమిటంటే నా క్లాస్మేట్ విలియంని హగ్ చేసుకోవడం. ఆ ఫోటోను నా ఫేస్‌బుక్‌లో ఇంకో స్నేహితురాలు పోస్ట్ చేసింది.

వీకెండ్ స్కూల్ టీమ్ టెన్నిస్ మ్యాచ్ గెలిచాక విలియం అభినందిస్తూ హగ్ ఇచ్చాడు. నా ఫ్రెండ్ వికా దాన్ని ఇవాళ ఉదయమే ఫ్రెండ్స్ అందరికీ షేర్ చేసింది. అప్పుడే అమ్మకెలా తెలిసిపోయింది? అర్థమయింది. ఇది నీరూ చేసిన పనే! నాన్న వచ్చి సర్ది చెప్పినా అమ్మ చల్లబడలేదు. నేను ఫేస్‌బుక్‌లో లాగిన్ అయ్యి ఆ ఫోటో తీసేసేవరకూ సతాయిస్తూనే ఉంది.

అంతే... అదే రోజు రాత్రి మా పేరెంట్స్ ఇద్దర్నీ నా ఫేస్‌బుక్ పేజీలో బ్లాక్ చేసేసాను. మర్నాడు స్కూలుకెళ్లాక నీరూని చెడామడా తిట్టాను. తనకేమీ తెలియదంది. నీరూ ఫేస్‌బుక్ పేజీలో కెళ్లి చూస్తే తెలిసింది నీరూ వాళ్లమ్మ నీరూ ఫ్రెండ్స్ లిస్టులో ఉంది.

బహుశా ఇది నీరూ వాళ్లమ్మ నిర్వాకం అని అర్థమయ్యింది. ఐ హేట్ నీరూస్ మామ్!

•••

నీరూ పేరెంట్సూ, మా అమ్మా నాన్నా ఒకేసారి అమెరికాకు వచ్చారు. అప్పటికి నేనింకా పుట్టలేదు.

నీరూకి వాళ్లమ్మ వెనకాలే ఉండి ప్రతిదీ చెబుతుంది. తను కూడా తు.చ తప్పకుండా నడుచుకుంటుంది. నీరూ ఎక్కడికి వెళ్లాలన్నా బాడీగార్డు వాళ్లమ్మే!

నీరూ ఎస్.ఏ.టి క్లాసుకెళ్లాలన్నా, పియానో క్లాసుకెళ్లాలన్నా ఆవిడ కూడా వెళుతుంది. ఇది చూసి అమ్మ కూడా వస్తానంటుంది. చిన్నప్పుడు అంటే మిడిల్ స్కూల్ వరకూ భరించాను కానీ, హైస్కూల్ కొచ్చాక నా వల్ల కాలేదు. అమ్మని రావద్దని చెప్పేసాను. దాంతో అమ్మ రెచ్చిపోయేది. మా ఇద్దరి మధ్యా యుద్ధం మొదలయ్యేది. మధ్యలో నాన్న వచ్చి మమ్మల్ని చల్లార్చేవాడు. హైస్కూలు మా ఇంటికి నడిచే దూరంలోనే ఉంది కనక బ్రతికిపోయాను. లేదంటే ప్రతీ రోజూ అమ్మ నాతో రావడమంటే... అమ్మో.

చిన్నప్పుడు... అంటే ఎనిమిదో తరగతి వరకూ అమ్మ చెప్పినట్లే చేసేదాన్ని. చుట్టూ ఉన్న ప్రపంచం అంటే ఏవిటో తెలిసాక నాలో మార్పొచ్చింది. అమ్మ చిన్నప్పుడు కర్ణాటక సంగీతం క్లాసు

ల్లో పెట్టింది. వెళ్లి బుద్ధిగా నేర్చుకున్నాను. కూచిపూడి డ్యాన్స్ క్లాసుల్లో పెట్టింది. వారం వారం వెళ్లి నేర్చుకున్నాను.

మిడిల్ స్కూల్ పూర్తయి క్యుపర్టినో మాంటా విస్తా హైస్కూల్లోకి వచ్చిన ఏడాది సమ్మర్‌లో అరంగేట్రం ఇచ్చాను. ఈబే ఏరియాలో అరంగేట్రం చేసిన వాళ్లల్లో నేనే యంగెస్ట్ అని అందరూ అన్నారు.

ఇవి కాక చదువెలాగూ ఉంది. స్కూల్లో నేను మిగతా కార్యకలాపాల్లో ఎక్కువగా పాల్గొనేదాన్ని కాదు. నీరూ మిడిల్ స్కూల్లో డిబేటింగ్ క్లబ్ ప్రెసిడెంట్. ఇయర్ బుక్ టీంకి లీడర్! తను పాల్గొనని అంశం లేదు.

నేను ఇవేమీ చెయ్యకపోవడంతో అమ్మకి అసంతృప్తిగానే ఉండేది. నాకు టెన్నిస్ ఇష్టం. స్కూలు టీములో ఉన్నానంతే!

దీనికి తోడు వారాంతాల్లో నీరూ వాళ్ల కుటుంబం కలిసిందంటే చాలు నీరూ వాళ్లమ్మ గొప్పల లిస్టు తీసేది. వాళ్లమ్మాయి స్కూల్లో ఏం చేస్తోందీ, ఎంతలా చదువుతోందీ, అన్నింటికన్నా ముఖ్యంగా తన మాట జవదాటకుండా ఎంత వినయంగా ఉంటుందీ, ఇలా సొంత గోలతోనే ఉన్న సమయం అంతా అయిపోయేది. ఇవన్నీ విని అమ్మ నామీద మరింత కోపం తెచ్చుకునేది. మెల్లమెల్లగా నీరూని దూరం పెట్టడం మొదలుపెట్టాను. ఐ స్టార్టెడ్ హేటింగ్ నీరూ!

•••

నా స్నేహితులెవరూ అమ్మకి నచ్చరు. నేను అమెరికన్లతో తిరిగి పాడయిపోతున్నానని అమ్మ ప్రతి రోజూ గోల చేస్తుంది.

"విజయ వాళ్ల అమ్మాయి నీరూని చూడు. ఎంత బుద్ధిగా ఉంటుందో? అన్నింట్లోనూ ఫస్ట్! వేసుకునే డ్రస్ దగ్గర్నుండి ఎంతో ముచ్చటగా ఉంటుంది. ఏం చూసుకుని నీకంత మిడిసిపాటు? నీరూని చూసి నేర్చుకో!" అమ్మ మాట్లాడే ప్రతీవాక్యమూ ఇదే ఉపోద్ఘాతంతో మొదలవుతుంది. విని విని విసుగొచ్చింది.


స్కూల్ నుండి ఇంటికి రాగానే అమ్మ చదువు పురాణం విప్పుతుంది. ర్యాంకుల రంధి మొదలవుతుంది. నిజానికి నాకు అన్ని సబ్జెక్టుల్లోనూ మంచి గ్రేడ్సే వస్తాయి. ఒక్కోసారి కాస్త తగ్గుతూ ఉంటాయంతే. అవి కిందకు పడినప్పుడల్లా మా ఇంట్లో చిన్నసైజు భూకంపం కుదిపేస్తుంది- అదేదో జీవితానికి ఆఖరి క్షణాలయినట్లు. దాంతో ఇష్టం ఉన్నా లేకపోయినా చచ్చినట్లు చదువుతాను, వీళ్ల పోరు పడలేక.

"బాగా చదువుకుంటే మంచి కాలేజీలో సీటొచ్చినా రాకపోయినా, ఈ పేరెంట్స్ గోల తప్పుతుంది. మన ప్రతి కదలిక మీదా నిఘా ఉండదు. దానికోసమయినా మనం చదవాలి" అంటుంది నా స్నేహితురాలు వికా. నాకూ నిజమే అనిపిస్తుంది. వికా నా బెస్ట్‌ఫ్రెండ్. ఏదైనా కాస్త మనసు విప్పి చెప్పుకోవాలంటే వికాతోనే చెప్పుకుంటాను.

మా కుటుంబం అంటే నాకు అసహ్యం వేస్తోంది. వీళ్లందరికీ దూరంగా ఎప్పుడు వెళ్లిపోతానా అని ఉంది.

ఎక్కడైనా కాస్త సంతోషం మనసుకి విశ్రాంతి ఉందంటే అది స్కూలొక్కటే! వికా, డెన్నిస్, లీసా, నేహ వీళ్లందరితో ఉన్న క్షణాలే కాస్త ఉపశమనంగా ఉంటాయి. స్కూలు లేని రోజులు నరకంగా అనిపించసాగాయి.

•••



అనుకున్నట్లుగానే నాన్న రాగానే అమ్మ ఆయనమీద గట్టిగా అరిచింది. నాన్న ఏం మాట్లాడలేదు. ఆఫీసూ, పనీ తప్పా నాన్న ఇంకేమీ అంతగా పట్టించుకోరు. ఎప్పుడైనా ఎలా చదువుతున్నావని అడుగుతారంతే!

"ఏమయ్యిందిరా? ఇంటికి రాగానే ఈ గోల?" అంటూ నాన్న నా గదికొచ్చి అడిగారు. జరిగిందంతా చెప్పాను.

అనుకున్నట్లుగానే నాన్న రాగానే అమ్మ ఆయన మీద గట్టిగా అరిచింది. నాన్న ఏం మాట్లాడ లేదు. ఆఫీసూ, పనీ తప్పా నాన్న ఇంకేమీ అంతగా పట్టించుకోరు. ఎప్పుడైనా ఎలా చదువుతున్నావని అడుగుతారంతే!
"ఏమయ్యిందిరా? ఇంటికి రాగానే ఈ గోల?" అంటూ నాన్న నా గదికొచ్చి అడిగారు. జరిగిందంతా చెప్పాను.

"ఇంతకీ నువ్వా ప్రామ్ నైట్‌కి వెళ్లి తీరాలా...? అమ్మ అక్కడ ఏదో జరుగుతుందని తెగ భయపడిపోతోందిరా...?" నాన్న మెల్లగా అడిగారు.

"డాడ్! ఇది మా ఒక్క స్కూల్‌కే కాదు. మొత్తం అన్ని స్కూళ్లలోనూ ఉంటుంది. అందరం ఆ రాత్రి అక్కడ పార్టీలో కలుస్తాం. డ్యాన్స్ చేస్తాం. అంతే! అయినా దానిమీద ఇప్పుడెందుకింత గొడవో అర్థం కావడం లేదు..." నచ్చచెప్పడానికి ప్రయత్నించాను. నాన్న అమ్మపేరు చెబుతూ నసిగాడు.

"డాడ్! నీకు గుర్తుందా? నాలుగేళ్ల క్రితం అన్నయ్య వెళ్లాడు కదా? అదే పార్టీ..." అని చెప్పబోతుండగా అమ్మ వచ్చింది.

"అన్నయ్య వేరు. నువ్వు వేరు. అయినా వాడు మగాడు... ఆ పార్టీలో ఏం జరుగుతుందో నాకంతా తెలుసు. దీని మాటలు మీరు నమ్మకండి. స్కూలంతా ఈ పార్టీకి వెళ్లరు. అక్కర్లేని వాళ్లు మానేయవచ్చు. అంతెందుకూ? నీతోటిదే నీరూ వెళ్లడం లేదుగా...నీ కెందుకంట...?"

"అమ్మా! నీరూ వెళుతుందో వెళ్లదో నాకనవసరం! నేను వెళతానంతే" అంటూ ఏడుస్తూ నా గది తలుపేసేసాను.

అమ్మ నాన్నతో వాదించడం చిన్నగా వినిపించింది. నేను డ్యాన్స్ బాగా చేస్తానని నా ఫ్రెండ్స్ అందరికీ తెలుసు. ప్రామ్‌నైట్‌లో డ్యాన్స్ పోటీ అనుకున్నాం. నా స్నేహితుల గ్రూపంతా నామీదే ఎంతో ఆశలు పెట్టుకున్నారు. నెగ్గితే ప్రామ్ క్వీన్‌గా నేను ఎన్నికవుతానని వికా, అందరూ ఎంతో ఉత్సాహంగా ఉన్నారు.

అన్నయ్య ఈ పార్టీకి వెళ్లినపుడు నాన్నచేత టక్సీడో(సూటు) కొనిపించుకున్నాడు. వాడికొక రూలూ, నాకొక రూలా? స్కూలు కెళ్లి వికాతో చెబితే అందరూ ఒక్కసారిగా డీలా పడిపోయారు. ఎలా తెలిసిందో మాతో డ్యాన్స్‌లో పోటీపడే వాళ్లందరూ నన్ను ఆట పట్టించటం మొదలుపెట్టారు. అమ్మ వద్దనడం కన్నా అందరూ నన్ను ఆట పట్టించడం(పిక్ చేయడం) అస్సలు భరించలేకపోయాను. హైస్కూళ్లలో ఈ పికింగ్ అన్నది భయంకరమైన మానసిక క్రీడ. అది తట్టుకోవడం ఎవరి వల్లా కాదు. దీని ప్రభావం ఒక్కోసారి చదువుమీద కూడా పడుతుంది. ఓ రోజు వికా ఇంటికెళ్లినప్పుడు వాళ్లమ్మ దగ్గర ఏడ్చేసాను కూడా.

అమ్మ ఇంట్లో లేనప్పుడు చూసి నాన్నని మళ్లీ అడిగాను.


"అక్కడేదో శృంగారం జరిగి నీకేదో అయిపోతుందని మీ అమ్మ భయం! తల్లిగా ఆవిడ బాధ ఆవిడది. అమ్మకే కాదు, నాకూ భయం ఉంది. నువ్వేమో వెళ్లాలంటావు...ఏం చెప్పాలో తెలీడం లేదు. మీ స్నేహితులంతా చివరి సారిగా కలిసి పార్టీ చేసుకుంటున్నారు. నాలుగేళ్ల స్నేహానికీ, స్కూల్లో గడిపిన క్షణాలకీ గుర్తుగా కలుస్తున్నారు. అర్థం చేసుకోగలను. నాకొంచెం టైమ్ ఇయ్యి. అమ్మని ఒప్పించడానికి ప్రయత్నిస్తాను..." అన్నాడు. ఇంట్లో నాకు బాగా చనువున్నది నాన్నతోనే!

నాకిష్టమైనవేవీ జరగవు. ఐ హేట్ మై లైఫ్!

•••

అమ్మ నాతో పూర్తిగా మాట్లాడ్డం మానేసింది. నాకు తెలీని డిప్రెషన్ మొదలయ్యింది. ఇది నా గ్రేడ్స్ మీద కూడా పడింది. ఈ ఆఖరి రెండు క్వార్టర్ల మార్కుల్నీ కాలేజీలు అంతగా పట్టించుకోవు. పాస్ అయితే చాలు. హఠాత్తుగా నీరూ వాళ్ల ఫ్యామిలీ ఇండియా వెళ్లారని తెలిసింది. ఎందుకంటే నీరూ బామ్మకి సీరియస్‌గా ఉందట. నాన్న అంటుంటే తెలిసింది. నీరూ కూడా స్కూల్లో స్పెషల్ పర్మిషన్ తీసుకుని వెళ్లింది. రోజూ నేను గ్రూప్ స్టడీ పేరు చెప్పి వికా ఇంటికి వెళ్లిపోయేదాన్ని. ఓ రోజు నాన్న నన్ను తీసుకెళ్లడానికి రావడం ఆలస్యం అయ్యింది. వికా వాళ్లమ్మ నాతో కబుర్లు చెప్పడం మొదలుపెట్టింది. మాటల్లో ప్రామ్ ప్రస్తావన వచ్చింది.

"నా మొట్టమొదటి ప్రామ్ నైట్ నాకింకా గుర్తుంది. ఇటీజ్ ఫన్! రాత్రంతా ఫ్రెండ్సందరూ డ్యాన్స్ చేస్తూ గడిపాం! ఐ లవ్ దట్ నైట్!" అంటూ ఆవిడ ప్రామ్ నైటుకి ఏం షాపింగ్ చెయ్యాలీ, ఏ డ్రెస్సు వేసుకోవాలీ, ఇవన్నీ తను ఎన్ని వారాలు ముందునుండీ ప్లాన్ చేసిందీ చెప్పుకుంటూ వచ్చింది. మాటల్లో నా ప్రిపరేషన్స్ గురించి అడిగింది. వెళ్లడం లేదని చెప్పడం ఇష్టం లేక నవ్వి ఊరుకున్నాను. వికా ప్లాన్ గురించి చెప్పింది. నేనేం మాట్లాడలేదు. ఇంతలో నాన్న వచ్చారు నన్ను తీసుకెళ్లడానికి.



మేం వెళుతుండగా వికా వాళ్లమ్మ నాన్నని అడిగింది.

"రామ్! మీ అమ్మాయి ప్రామ్ పార్టీకి వెళ్లకపోవచ్చని వికా చెప్పింది. ఎందువల్ల? అది ఎవరికయినా జీవితంలో గుర్తుండే రోజు. ఇలాంటివి మీ ఇండియాలో లేవని నాకు తెలుసు. షీ ఈజ్ ఎ గుడ్ డ్యాన్సర్! మీ అమ్మాయి డ్యాన్స్ ప్రోగ్రాంకి వచ్చాను. మీరేం భయపడనవసరం లేదు..వీళ్లందరూ వెల్ బిహేవ్డ్ గర్ల్స్!" నవ్వుతూ అంది.

"మా కల్చర్లో ఇలాంటివి లేవు..." అంటూ నాన్న నసిగాడు. ఆ మాటలు విని ఆవిడ గట్టిగా నవ్వింది.

"కమాన్ రామ్! దిస్ ఈజ్ జస్ట్ ఎ పార్టీ! నేనూ ఇండియా వెళ్లాను. ఖజురహో, కోణార్క్ అన్నీ చూసాను. అక్కడ గోడల మీద ఏముందో నీకూ తెలుసు. సెక్స్‌కి కల్చర్ ఉండదు. శరీరానికి అదొక అవసరం అంతే! అయినా ఒక్క విషయం! మన పిల్లలు ఎదిగారు, ఎదుగుతున్నారు అన్నది పేరెంట్స్‌గా మనం గ్రహించాలి. గైడ్ దెమ్! అండ్ రెస్పెక్ట్ దెమ్! కట్టుదిట్టం చేస్తే కళ్లముందే జారిపోతారు!" అంటూ నాకేసి చూస్తూ అనేసరికి నాన్న విస్తుబోయాడు.

పార్టీకి వెళ్లడం లేదన్న సంగతి వాగేవా అని గట్టిగా అన్నాడు. నేనెవరితోనూ అనలేదని, ఒక్క వికాతోనే చెప్పానని ప్రామిస్ చేస్తూ చెప్పాను.

"అమ్మ భయమల్లా ఒక్కటే! నువ్వక్కడ ఏ అబ్బాయితోనో సెక్స్..." నాన్న మాటలు అక్కడితో ఆగిపోయాయి. నాన్న నాతో ఇంత ఓపెన్‌గా మాట్లాడ్డం ఇదే మొదటిసారి.

"డాడ్! నన్ను నమ్ము! మీకు తలవంపు తెచ్చే పనేమీ చెయ్యను నేను... ప్రామిస్!" అని చేతి మీద చెయ్యేసి అన్నాను.

ఒకటికి రెండు సార్లు తన భయం గురించి చెప్పాడు. అమ్మకి నచ్చచెబుతాననే అన్నాడు. కాని అమ్మ ఎలాగూ ఒప్పుకోదు. ఇంట్లో మూడో ప్రపంచ యుద్ధం ఖాయం. ఐ హేట్ మామ్!

"కమాన్ రామ్! దిస్ ఈజ్ జస్ట్ ఎ పార్టీ! నేనూ ఇండియా వెళ్లాను. ఖజురహో, కోణార్క్ అన్నీ చూసాను. అక్కడ గోడలమీద ఏముందో నీకూ తెలుసు. సెక్స్‌కి కల్చర్ ఉండదు. శరీరానికి అదొక అవసరం అంతే! అయినా ఒక్క విషయం! మన పిల్లలు ఎదిగారు, ఎదుగుతున్నారు అన్నది పేరెంట్స్‌గా మనం గ్రహించాలి. గైడ్ దెమ్! అండ్ రెస్పెక్ట్ దెమ్! కట్టు దిట్టం చేస్తే కళ్లముందే జారిపోతారు!"

•••

నాన్న ఏం చెప్పారో తెలీదు, అమ్మ అభ్యంతరం పెట్టలేదు. నాతో మాత్రం మాటాడ్డం మానేసింది. నేను ప్రామ్‌పార్టీకి వెళ్లాను. నాన్న కూడా వచ్చి దిగబెట్టారు. రాత్రి ఎనిమిది నుండి రెండింటి వరకూ పార్టీ ఉంటుంది. నాన్న పన్నెండుకల్లా వస్తాననీ, ఆ టైముకి బయటికొచ్చేయాలనీ షరతు పెట్టాడు. ఒప్పుకున్నాను. నాన్నలాగే చాలామంది ఇండియన్ పేరెంట్స్‌కీ అదే భయం ఉందేమో పార్టీ జరిగేచోట బయటే ఉన్నారు. నాన్న మాత్రం అక్కడ ఉండకుండా వెళ్లిపోయారు.

రంగు రంగుల దీపాలూ, వెనుక సంగీతమూ, ఎంతో అందంగా తయారయ్యి హుషారుగా ఆడుతూ పాడుతూ సాగే ఆ క్షణాలు మమ్మల్ని వేరే లోకంలోకి తీసుకెళ్లాయి. అనిర్వచనీయమైన అనుభూతి. మా గ్రూప్ డ్యాన్స్ పోటీలో నెగ్గింది. నాకు ప్రామ్ క్వీన్ కిరీటం పెట్టారు. ఫ్రెండ్స్ అందరం ఫోటోలు తీయించుకున్నాం. మర్నాడు ఫేస్‌బుక్కునిండా అవే ఉంటాయని తెలుసు. ప్రతీ ఒక్కరం సెల్ఫీలు తీసుకున్నాం.

రాత్రి డిన్నర్ చేస్తుండగా రాబర్ట్ నా పక్కగా వచ్చి నిలబడ్డాడు. రాబర్ట్టూ, నేనూ మేత్, లిట్ క్లాసుల్లో మాత్రమే కలుస్తాం. అతను మా గ్రూపు కాదు. కలిస్తే హలో అంటే హలో అంతే. ఇతను కూడా డిబేట్ క్లబ్బులో ఉన్నాడు మంచి గ్రేడ్స్ వస్తాయి. నాతో మాట్లాడాలని పక్కకి రమ్మనమని పిలిచాడు రాబర్ట్. ఏవిటాని వెళ్లాను. అతను చెప్పింది విని షాక్ తిన్నాను. నీరూ రాలేదేమని అడిగాడు. వాళ్ల బామ్మకి సీరియస్ అని చెప్పాను. వెంటనే- తను ఇహ ఇండియాలోనే చదువుకుంటుందట కదా? కేలిఫోర్నియా రాదట కదా? అని అడిగాడు. నాకేవీ తెలియదనీ, నేను తనతో మాట్లాడననీ చెప్పాను. తనూ, నీరూ డేటింగ్ చేసామనీ, ఇది ఎవరికీ తెలీదనీ చెప్పాడు. నేను నమ్మలేకపోయాను.

"నేనూ, నీరూ సెక్సువల్‌గా కలిసిన విషయం వాళ్లింట్లో తెలిసి

నీరూని వాళ్లు కొట్టారట. తను ఫేస్‌బుక్కూ, ఈ మెయిల్స్ అన్నీ బ్లాక్ చేసేసింది. నీరూ పేరెంట్స్ బాగా అప్‌సెట్ అయ్యారనీ, ఇహ ఇండియా పర్మనెంటుగా వెళ్లిపోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారనీ తెలిసింది. ఇందులో నీరూ కంటే నా తప్పే ఎక్కువ! అనవసరంగా మేం...” అంటూ ఆగిపోయాడు. నమ్మబుద్ధి కాలేదు. నిజంగా నాకిది షాక్! ఇప్పుడర్థమయింది నీరూ వాళ్ల ఫ్యామిలీతో కలిసి, స్కూలు మానేసి మరీ ఎందుకు ఇండియా వెళ్లిందో! ఎవరితోనూ చెప్పొద్దని అన్నాడు. ప్రామిస్ చేసాను. నీరూ విషయం ఇంకడానికి కొన్ని నిమిషాలు పట్టింది.

రాత్రి పన్నెండవ్వగానే నాన్నవచ్చి బయట వెయిట్ చేస్తున్నట్టుగా ఫోన్‌కి మెసేజ్ వచ్చింది. అందరికీ బై చెప్పి బయటకు వచ్చేసాను. వస్తూనే నాన్నకి సంతోషంగా థ్యాంక్స్ చెప్పాను. ఇంటికి డ్రైవ్ చేస్తూ పార్టీ ఎలా జరిగిందని అడిగాడు. అన్నీ పూసగుచ్చినట్లు చెప్పాను. నేను ప్రామ్ క్వీన్‌గా ఎన్నికయ్యాననీ చెప్పాను.

“ఇప్పటికీ అమ్మ ఎందుకు వద్దందో అర్థం కావడం లేదు డాడ్!” అన్నాను.

“ఒక పేరెంట్‌గా భయంరా! యు హేవ్ టు బి ఎ పేరెంట్ టు నో హౌ ఎ పేరెంట్ థింక్స్! ఇది మన కల్చర్ కాదు. నువ్వెక్కడ పెళ్లికి ముందే వర్జినిటీ కోల్పోతావో, నిన్ను మన వాళ్లెవరూ పెళ్లి చేసుకోరేమోనని ఆవిడ భయం!”

చటుక్కున అన్నయ్య గుర్తొచ్చాడు. “డాడ్! వర్జినిటీ ఆడవాళ్లకేనా? మగాళ్లకి అవసరం లేదా?”



నా మాట విని నాన్న నోరెళ్లబెట్టి ఆశ్చర్యంగా నాకేసి చూస్తూ, నిశ్శబ్దంగా ఉండిపోయాడు. నా ప్రశ్నకు నాన్న ఇబ్బంది పడ్డాడని గ్రహించాను. అలా అడిగి ఉండాల్సింది కాదేమో?

నీరూ గుర్తొచ్చి రాబర్ట్ చెప్పింది చెబుదామా అనుకుని ఆగిపోయాను. నా వాళ్ల లాగే నీరూ అమ్మా నాన్నా కూడా ఆలోచిస్తారు కదా! రాబర్ట్ చెప్పింది బయటికి పొక్కనివ్వదల్చుకోలేదు.

“డాడ్! ఒక చిన్న మిస్టేక్ జరిగింది. నేనూ, విలియం కలిసి డ్యాన్స్ చేసాం. డ్యాన్స్ పోటీ నెగ్గాక నేను చాలా అందంగా ఉన్నానంటూ విలియం నన్ను ముద్దు పెట్టుకోవడానికి ప్రయత్నించాడు. నేనే వదిలించేసుకున్నాను. నీకు నిజం చెబుతానని అన్నాను కదా..” అంటూ భయపడుతూ ఆగిపోయాను.

ఆశ్చర్యం! నాన్న నన్ను ఏమీ అనలేదు. చిన్నగా నవ్వుతూ నమ్మకంగా నా భుజమ్మీద చేత్తో తట్టాడు.

“నువ్వు నిజం చెప్పినందుకు సంతోషంగా ఉంది..” అని మాత్రం అన్నాడు. అమ్మ గుర్తొచ్చింది. నాన్నెలాగూ అమ్మకి చెబుతాడు. ఆవిడ ఇంకో యుద్ధానికి తెరతీస్తుంది.

విలియం నన్ను ముద్దు పెట్టుకున్నట్లు నేను చెప్పిన దాంట్లో సగమే నిజముంది. ఆ క్షణాలు నేనూ అమితంగా ఆనందించాను.

మా కారు క్రమంగా వేగం పుంజుకుని శాన్‌ఫ్రాన్సిస్కో నుండి కుపర్టినో వైపుకు వెళ్లసాగింది.

.... gorthib@yahoo.com

## ఈ వారం కవిత



# మందమైన జీవితం

సిగ్నల్స్ దగ్గర మొఖాలు చూస్కుంటం.
        మొబైల్ల మాట్లాడుకుంటం. ఫంక్షన్లల్ల
పక్కపక్కన కూసుంటం. వార్మ్ విషెస్సన్నీ
        ఫేస్బుక్కుల ఏలాడేస్తం. కాంటాక్ట్
తెగింతర్వాత కల్సిన ప్రతిసారీ పాతఫోన్
        పొయ్యిందనే క్యాజువల్ లీవుకి అప్లై
చేస్తం.

మెమరిలాస్ పాలబడలేదుగానీ, ప్రయారిటీల
        ప్రహరీ గోడలు రోజుకింత ఎత్తు
పెరుగుతుంటై. సఫకేషన్ తెలుస్తుంటదిగానీ,
        తేరగ దొర్కిన పొల్యూషన్ మీద
నెట్టిపారేస్తం. కళ్ళని శూన్యానికి,
        చెవుల్ని హెడ్ ఫోన్లకి అప్పగిచ్చుడుకన్న
సొల్యూషన్ లేదని డిక్లరేషన్ ఫాం మీద
        సైన్ ఇన్ అయితం.

టవర్లు తలదాస్కుంటానికి కాదు. ఫ్లయ్యోవర్లు
        పండుకుంటానికి కాదు. నీకు
నాకు మజ్జన ఏంలేదని కాదు,
        కాకపోతె అది పైసకి పనికి రాదు.

ఇనిపిచ్చినదాంట్ల సంగీతాన్ని, కనిపిచ్చినదాంట్ల
        జీవితాన్ని దేవులాడుకుంట
సెర్చ్ కల్చరయినం. రోడ్డు అవుతలి మనిషిని
        రోడ్డు ఇవుతలికెల్లే అల్లుకొని
బై చెప్పుడు నేర్చినం. మనం, మస్తు నిక్లాయించినం.

- **మోహన్ రుషి** , 83417 25452